# మహిళా బిల్లును అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత
- ట్యాంక్ బండ్ పై బసవేశ్వరుడికి నివాళులు



**ప్రజానావ, హైదరాబాద్:** కుల, వర్ణ, లింగ విభక్షత లేని సమాజ స్థాపన కోసం 839 ఏళ్ల క్రితమే పోరాడిన విప్లవకారుడు మహాత్మా బసవేశ్వరుడని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొనియాడారు. మంగళవారం ట్యాంక్ బండ్ పై గల బసవేశ్వరుడి విగ్రహానికి ఆమె పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆమె, బసవేశ్వరుడు ఆనాడే చాటిన ప్రజాస్వామిక విలువలు, సమానత్వ సిద్ధాంతాలను నేటికీ మనం పూర్తిస్థాయిలో సాధించుకోలేకపోవడం వెనుకబాటుతనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. చట్టసభల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించే మహిళా రిజర్వేషన్ బిల్లును అనేక శక్తులు కుట్రపూరితంగా అడ్డుకున్నాయని కవిత ఆరోపించారు. ఆ బిల్లు పార్లమెంట్‌లో పాస్ అయ్యి ఉంటే మహిళా సాధికారతకు నిజమైన అర్థం చేకూరేదని ఆమె అభిప్రాయపడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికలను ఉదాహరణగా చూపుతూ, రాజకీయ పార్టీలు మహిళలకు టికెట్లు ఇవ్వడంలో చూపుతున్న వివక్షను ఎండగట్టారు. ఒక పార్టీ 8 సీట్లు, మరో పార్టీ 10 సీట్లు మాత్రమే కేటాయించడం వల్ల నేడు అసెంబ్లీలో కేవలం ఎనిమిది మంది మహిళా ఎమ్మెల్యేలు మాత్రమే ఉండటం శోచనీయమన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారే బసవేశ్వరుడి సిద్ధాంతాల నుండి స్ఫూర్తి పొందారని కవిత గుర్తు చేశారు. బసవేశ్వరుడు చూపిన బాటలోనే తాము ఏర్పాటు చేయబోయే రాజకీయ సామాజిక వేదిక పనిచేస్తుందని స్పష్టం చేశారు. మహిళా ప్రాతినిధ్యం విషయంలో కేవలం మాటలకే పరిమితం కాకుండా, పార్టీ పదవుల్లోనూ మరియు ఎన్నికల టికెట్ల కేటాయింపులోనూ మహిళలకు 33 శాతం వాటా ఇస్తామని ఆమె ఈ సందర్భంగా కీలక ప్రకటన చేశారు. బసవేశ్వరుడు కోరుకున్న సమానత్వం, సమాన అవకాశాల సాధన కోసం ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని కవిత పిలుపునిచ్చారు. లింగ భేదం లేని సమాజం కోసం సామాజిక న్యాయ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జాగృతి ప్రతినిధులు, బసవ కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

# జాగృతిలోకి చేరికల వెల్లువ

**కవిత సమక్షంలో కండువా కప్పుకున్న మెదక్ మాజీ జడ్పీ చైర్మన్**



**ప్రజానావ, బంజారాహిల్స్:** తెలంగాణ జాగృతి కేంద్ర కార్యాలయం వేదికగా సామాజిక, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు ఆ సంస్థలో చేరారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో మెదక్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బాలయ్య తన భారీ అనుచరగణంతో కలిసి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో ఆ సంస్థ తీర్థం పుచ్చుకున్నారు. కవిత ఆయనకు కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జాగృతిలో జరుగుతున్న ఈ చేరికలు సంస్థ బలాన్ని, ప్రజల్లో ఉన్న ఆదరణను ప్రతిబింబిస్తున్నాయని నేతలు అభిప్రాయపడ్డారు. రాజకీయ నేతలతో పాటు మీడియా రంగానికి చెందిన ప్రముఖులు కూడా జాగృతి బాట పట్టడం విశేషం. తెలంగాణ డిజిటల్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు అరుణ్ కుమార్ తన సహచర స్వతంత్ర జర్నలిస్టులతో కలిసి జాగృతిలో చేరారు. వీరితో పాటు దళిత జస్టిస్ ఫోరం చైర్మన్ మేడి నరేశ్, బతుకమ్మ పార్టీ అధ్యక్షుడు కె. మణిపాల్ రెడ్డి కూడా తమ అనుచరులతో కలిసి కవిత నాయకత్వంలో పనిచేసేందుకు ముందుకు వచ్చారు. సామాజిక హక్కుల కోసం, తెలంగాణ సంస్కృతి పరిరక్షణ కోసం జాగృతి చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు.

# సిరిసిల్ల ఆర్టీసీ డిపో ఎదుట నిరసన

**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల ఆర్టీసీ డిపో నుండి మహిళా ఉద్యోగులు డిపో ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం రాష్ట్ర జేఏసీ కమిటీ పిలుపు మేరకు సిరిసిల్ల డిపో ఆధ్వర్యంలో డిపో ముందు మహిళ ఉద్యోగులు, డిపో ఉద్యోగులు నిరసన కార్యక్రమం తో పాటు సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర కమిటీ సభ్యులు జి పి సింగ్, జిల్లా కమిటీ సభ్యులు ఏపీ రావు, డిపో జేఏసీ కమిటీ చేర్మెన్ సిహెచ్. బాణయ్య, వైస్ చైర్మన్లు జెఎస్ఎన్ రావు, బి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల డిపో మహిళా జేఏసీ కన్వీనర్లు, సునీత, కరుణ, ఉమా, నిర్మల, రోజరాణి, కాళేశ్వరి, పద్మ, త్రివేణి, స్వప్న, శ్వేత తదితరులు పాల్గొన్నారు.



# సమాజ నిర్మాణంలో యువత ముందుకు రావాలి

- అంబేద్కర్ జయంతి వారోత్సవాలలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జి మోహన్ రెడ్డి




**ప్రజానావ, సిరిసిల్ల :** యువత అంబేద్కర్ ఆలోచనలను తెలుసుకొని సమాజ నిర్మాణంలో ముందుకు రావాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ రూపకర్త డా. బిఆర్ అంబేద్కర్ జయంతి వారోత్సవాలల్లో భాగంగా సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి సమావేశానికి అధ్యక్షత వహించగా జిల్లా ఇన్చార్జి గంగా డి మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి గంగాడి మోహన్ రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ భారత రాజ్యాంగ రూపకర్తగా దేశానికి దిశానిర్దేశం చేసిన మహానీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు లింగంపల్లి శంకర్, అల్లాడి రమేష్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లరపు సంతోష్ రెడ్డి, జిల్లా కోశాధికారి ఆసానీ రామలింగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రాజాసింగ్, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, జిల్లా పదాధికారులు, వివిధ మండలాల అధ్యక్షులు నూతనంగా ఎన్నికైన మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, బిజెపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఘనంగా వెంకన్న విగ్రహ ప్రతిష్ట

**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రతిష్ట మహోత్సవం ఘనంగా జరిగింది. సోమవారం వేదమూర్తులైన బ్రాహ్మణోత్వములచే స్వామివారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ (సెస్) చైర్మన్ చిక్కాల రామారావు, బీ అర్ ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో మే డే పోస్టర్ల ఆవిష్కరణ

**ప్రజానావ, సిరిసిల్ల:** ఎనిమిది గంటల పని విధానం కోసం ఇప్పటికీ పోరాటాలు కొనసాగుతున్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు తెలిపారు. సోమవారం సుభాష్ నగర్ కార్మిక భవన్‌లో మే డే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 10 గంటల పని విధానాన్ని వ్యతిరేకిస్తూ, పవర్ లూమ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, నైట్ డ్యూటీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల్లో మార్పులు చేసి కార్మికులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. మే 1న కార్మిక దినోత్సవంలో భారీగా పాల్గొని భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు కార్మిక నాయకులు పాల్గొన్నారు.

# కూలి పెంచాలని నేతన్నల నిరసన

**ప్రజానావ, సిరిసిల్ల:** నేతన్నల కష్టాన్ని యజమానులు దోచుకోవడం సరైంది కాదని తెలంగాణ పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ అన్నారు. కూలీ పెంపు డిమాండ్ చేస్తూ పాలిస్టర్ వస్త్ర పరిశ్రమ కార్మికులు సోమవారం ఒకరోజు సమ్మె నిర్వహించారు. సినారే కళామందిర్ ఎదుట ఉన్న యజమానుల సంఘ కార్యాలయం ముందు మరమగ్గాలు బంద్ చేసి నిరసన తెలిపారు. కూలీ ఒప్పందం గడువు ముగిసి రెండేళ్లు అయినప్పటికీ పెంపుపై స్పందన లేకపోవడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరిగిన నిత్యవసర ధరల నేపథ్యంలో కూలీ పెంపు లేకపోతే వృత్తిలో కొనసాగలేమని స్పష్టం చేశారు. సమస్య పరిష్కారానికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

# సిరిసిల్ల ప్లాంటేషన్‌లో పరిశీలన

**మొక్కల పెంపకం, సంరక్షణ పద్ధతులపై ఐసీఎఫ్ఆర్ఐ బృందం ఆరా**



**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల పట్టణం లోని జ్యోతినగర్ ప్లాంటేషన్ ప్రాంతాన్ని ఐసిఎఫ్ఆర్ఇ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ బయోడైవర్సిటీ) బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా బృంద సభ్యులు అక్కడ నిర్వహిస్తున్న మొక్కల పెంపకం కార్యక్రమం, మొక్కల సంరక్షణ పద్ధతులను సమగ్రంగా పరిశీలించారు. ప్లాంటేషన్ ప్రాంతంలో మొక్కల పెంపకం, సంరక్షణ, నీటి పారుదల, గడ్డి తొలగింపు, రక్షణ చర్యలు వంటి నిర్వహణ పనులు ఎంతో సమర్థవంతంగా కొనసాగుతున్నాయని వారు అభినందించారు. ఈ ప్రాంతంలో చేపట్టిన చర్యలు ఇతర ప్రాంతాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది కృషిని ఐసిఎఫ్ఆర్ఇ బృందం ప్రత్యేకంగా ప్రశంసించింది. ప్లాంటేషన్ నిర్వహణలో చూపుతున్న నిబద్ధత భవిష్యత్తులో పర్యావరణ పరిరక్షణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడింది.

# నాగ్‌పూర్‌లో ఎన్జీవో అరాచకం

**యువతులపై లైంగిక వేధింపులు..**

**ప్రజానావ, ముంబై :** మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఎన్జీవో ముసుగులో యువతులపై లైంగిక, మానసిక వేధింపుల కేసు వెలుగులోకి వచ్చింది. 'యూనివర్సల్ మల్టీపర్పస్ సొసైటీ' డైరెక్టర్ రియాజ్ కాజీని పోలీసులు అరెస్టు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు అతను అసభ్య ప్రవర్తనతో పాటు మతపరమైన ఆచారాలను బలవంతం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సీసీటీవీ ఆఫ్ చేసి వేధింపులకు పాల్పడినట్లు, సోషల్ మీడియా ద్వారా పర్యవేక్షణ చేసినట్లు కూడా బయటపడింది. ఇప్పటికే నలుగురు యువతులు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

